క్లుప్తంగా

మార్కెట్ కమిటీ సభ్యులకు సత్కారం



ప్రత్తిపాడులో మార్కెట్ వైస్ చైర్మన్,డైరెక్టర్లను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

ప్రత్తిపాడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయ శేఖర్‌లను సోమవారం విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులు శేరు కృష్ణ, జయశేఖర్‌లను పూలమాలలతో సన్మానించారు. తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌కు శేరు కృష్ణ, జయశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు మేడిబోయిన చంద్రశేఖర్, సంఘ నాయకులు దవరసింగ్ అబ్బులు, త్రిపురాళ్ల బాబూరావు, ధర్మాలకోట దుర్గా ప్రసాద్, గంగాధర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా విద్యాసాగర్ కుమార్ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మకు సత్కరించిన అధికారులు

తుని రూరల్: తుని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా పి.విద్యాసాగర్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గొల్లప్రోలులో ఈఓపీఆర్డీ పని చేస్తున్న ఆయన తుని ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కోటనందూరు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తుని ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఇన్నాళ్లూ అదనపు బాధ్యతలు నిర్వహించిన సుబ్రహ్మణ్య శర్మను ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. కాగా నూతన ఎంపీడీఓ బాధ్యతులు చేపట్టిన విద్యాసాగర్ కుమార్‌ను ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఏపీఓ నారాయణరావు, ఈఓపీఆర్డీ జయరామ్, పంచాయతీ కార్యదర్శులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత



బాలుడి తండ్రికి ఆర్థిక సహాయం అందజేస్తున్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ ఉద్యోగులు

గోకవరం: గ్రామంలో అరుదైన బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీ అక్షయ్‌రామ్ వైద్యానికి మండలంలోని వీరలంకపల్లి శివారున ఉన్న హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ సిబ్బంది చేయూనందించారు. ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, లారీ డ్రైవర్లు కలిసి సుమారు రూ.50 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని మేడే దినోత్సవం సందర్భంగా సోమవారం బాలుడి తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో గ్యాస్ ప్లాంట్ సిబ్బంది ఉరుము విష్ణు, పైలి నాని, గొంతెన సూరిబాబు, కోమటి శ్రీను, కొప్పాక వీరబాబు, వై.రమేష్, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేములమ్మతల్లి జాతర

రౌతులపూడి: మండలంలోని ములగపూడి గ్రామదేవత వేములమ్మతల్లి జాతర సోమవారం ఘనంగా జరిగింది. నెలరోజుల పాటు అమ్మవారి ఘటాన్ని గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజనలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేసు కొట్టివేతపై హర్షాతిరేకాలు



ఏనుగువీధి సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ముద్రగడ అభిమానులు

కిర్లంపూడి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై కోర్టులో ఉన్న కేసు సోమవారం కొట్టేయడంతో కిర్లంపూడిలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఏనుగు వీధి సెంటర్ నుంచి జగపతినగరం వరకూ తీన్మార్ డ్యాన్స్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏనుగువీధి సెంటర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. రాజకీయాల్లో అవినీతి ఆరోపణలు ఎరగని స్వచ్ఛమైన నాయకుడు ముద్రగడ పద్మనాభం అని అభిమానులు కొనియాడారు. పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, రాపేటి పెద్ద, తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంబరాలు

ఏలేశ్వరం: తుని రైలు దగ్ధం కేసును కోర్టు కొట్టివేయడంపై పట్టణంలో కాపులు సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగడ వీరేంద్ర, గోపు శ్రీనివాస్, మలకల చిన్ని, కోరుకొండ నూకరాజు, పెచ్చెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురిపింఛెన్

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో జోరుగా సాగింది. తుపాను ప్రభావంతో తెల్లవారుజాము నుంచి మూడు నియోజకవర్గాల్లోనూ భారీ వర్షం కురిసింది. కాగా గ్రామ వలంటీర్లు హోరు వానను సైతం లెక్క చేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. రైన్ కోట్లు, గొడుగులతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛను అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జోరుగా సామాజిక పింఛన్ల పంపిణీ
- హోరువానను సైతం లెక్క చేయని వలంటీర్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



లింగంపర్తిలో వర్షంలో గొడుగులతో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు వర్షాన్ని లెక్కచేయకుండా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఏలేశ్వరం మండలంలోని తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నియోజవర్గంలో 24 వేలకు పైగా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు ఉన్నాయి. లింగంపర్తిలో వైఎస్సార్ సీపీ నాయకుడు యార్లగడ్డ రాజాచౌదరి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

జగ్గంపేట: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. కాగా రామవరం గ్రామ వలంటీరు చింతపల్లి రాజేష్ వర్షంలోనూ రైన్ కోటు వేసుకుని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. జగ్గంపేటలోనూ వలంటీర్లు హోరువానను సైతం లెక్క చేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. వర్షంలోనూ లబ్ధిదారులకు పింఛన్లు అందచేసిన వలంటీర్లను రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

తుని రూరల్: మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ వల్లి అనారోగ్యంతో తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతునారు. వల్లి పింఛనుదారుడు కావడంతో సోమవారం గ్రామ వలంటీర్ షేక్ ఖాదర్ తాళ్లూరు నుంచి ఆరు కిలో మీటర్ల దూరం వెళ్లి తుని ఏరియా ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ మొత్తాన్ని అందజేశాడు. వలంటీర్ షేక్ ఖాదర్‌ను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు తమరాన శ్రీనివాస్, అధికారులు అభినందించారు.

ప్రత్తిపాడులో 70 శాతం..

ప్రత్తిపాడు: మండలంలోని తొలిరోజు సోమవారం 70 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,846 మంది పింఛనుదారులుండగా సాయంత్రం 5 గంటలకు సుమారు 8,300 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేశారని ఎంపీడీఓ ఎస్. వెంకటాచలం తెలిపారు. గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.



రామవరంలో వర్షంతో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్ రాజేష్



తుని ఏరియా ఆస్పత్రిలో షేక్ ఖాదర్ వల్లీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్



ప్రత్తిపాడులో జోరువానలోనూ వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్, నాయకులు

న్యాయవిజ్ఞాన సదస్సు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న కోర్టు ప్యానెల్ అడ్వొకేట్ బుగత శివ

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్యానెల్ అడ్వొకేట్ బుగత శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలో కార్మికుల హక్కులు, పని గంటలు, మెరుగైన వేతనాలకు సంబంధించిన చట్టాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రతి శనివారం జూనియర్ సివిల్ జడ్జి చైర్మన్‌గా ఉన్న కమిటీ సమావేశమై సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు, అసంఘటిత రంగాల్లో ఉండే కార్మికులకు ఎటువంటి న్యాయ సహాయం కావలసినా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

గోకవరం: స్థానిక మెయిన్‌రోడ్డు చెంత వేంచేసిన దాసాంజనేయస్వామి ఆలయ 98వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కార్మికులకు ఉపాధి కరవు

జగ్గంపేట: రాష్ట్రంలో కార్మికులు, శ్రామికులకు ఉపాధి కరువైందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. ప్రభుత్వం బీసీ వర్గాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

అరుణపతాకం రెపరెపలు



జగ్గంపేట స్టాలిన్ భవనం వద్ద మేడే వేడుకలు



ఏలేశ్వరంలో మేడే సంబరాలు

తుని/ఏలేశ్వరం/కిర్లంపూడి/జగ్గంపేట/ప్రత్తిపాడు/శంఖవరం/రౌతులపూడి/గోకవరం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అరుణపతాకం రెపరెపలాడింది. గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిపారు. తునిలో సీఐటీయూ అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. పలు కార్మిక సంఘాలు నేతలు జెండాలను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏలేశ్వరంలో సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. అనంతరం పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు. కిర్లంపూడి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద జగపతినగరం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. తొలిత కిర్లంపూడి ప్రధాన రహదారిపై తాపీమేస్త్రి సంఘాలు, అంగన్‌వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. జగ్గంపేట స్టాలిన్ భవనంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు మరుకుర్తి ఏసు కార్మిక జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ భవనంలో జిల్లా కార్యదర్శి ఎంవీ సాయిరాం అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయం వద్ద లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తోందని ఆరోపించారు అనంతరం గ్రామంలో లిబరేషన్ అనుబంధ సంస్థల కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. శంఖవరం మండలం కత్తిపూడిలో మోటారు మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గౌతు సతీష్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గోకవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. యూనియన్ నాయకులు కార్మిక జెండాను ఎగురవేశారు.

గ్రామాల్లో శాంతి కమిటీల ఏర్పాటు



జగ్గంపేటలో శాంతి కమిటీ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. స్థానిక శెట్టిబలిజపేట, గోపాలనగర్ ప్రాంతాల్లో ప్రజలకు సోమవారం శాంతి కమిటీల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, సారా విక్రయాలు చేస్తే అటువంటి వారి సమాచారం తక్షణమే అందించాలని శాంతి కమిటీ సభ్యులను కోరారు. ప్రస్తుత వేసవిలో ఆరుబయట నిద్రించేవారు తమ శరీరంపై ఉన్న విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని, వేసవి సెలవుల నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లివారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతికమిటీల్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు కలిపి మొత్తం ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నూకరాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తంటికొండలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఉదయం స్వామి వారి గిరి ప్రదక్షణ ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఈఓ చందన ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, రాజమహేంద్రవరం నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కిర్లంపూడి: స్థానిక చిల్లంగి శ్రీనివాసనరగ్‌లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకుడు చక్రవర్తుల వెంకట సత్యరాఘవాచార్యులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఇంటర్ విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు



కేజీబీవీలో ప్రత్యేక తరగతుల నిర్వహణపై అధ్యాపకులకు సూచనలిస్తున్న జిల్లా అధికారి ఉమా మహేశ్వరి

తుని రూరల్: ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థినులను సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా బాలికా సంరక్షణాధికారి (జీసీడీఓ) ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 131 మంది విద్యార్థినులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుని మండలం వి.కొత్తూరు, తొండంగి, శంఖవరం, కోటనందూరు కేజీబీవీలకు చెందిన 131 మంది విద్యార్థినులు ఈ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నట్టు తెలిపారు. ప్రత్యేక తరగతులు మే ఒకటి నుంచి 22 వరకు నిర్వహిస్తామన్నారు. వందశాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించాలన్నదే లక్ష్యమన్నారు. తరగతుల నిర్వహణపై అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ బి.అమృతవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్యదేవుని వైభవం పుస్తకం ఆవిష్కరణ



సత్యదేవుని వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

అన్నవరం: సత్యదేవుని ఆవిర్భావం, వ్రతకథ తదితర విశేషాలతో భద్రాచలం దేవస్థానం పండితుడు అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన అన్నవరం వైభవం పుస్తకాన్ని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. గతంలో దేవదాయశాఖ మంత్రి రత్నగిరిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవస్థానం గురించి పలు కథనాలతో పుస్తకాలు ప్రచురితం కావడంతో భక్తులు గందరగోళానికి గురవుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో దేవస్థానానికి చెందిన వాస్తవ సమాచారంతో చిన్న పిల్లలు కూడా చదివి తెలుసుకునేందుకు వీలుగా వివిధ చిత్రాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని త్వరలో భక్తులకు విక్రయించనున్నట్టు ఈవో చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

గోకవరం: మండలంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేఎస్ఎన్ మూర్తి పరిశీలించారు. నూక శాతం పరీక్ష చేసే మినీ మిల్‌ను మండల కేంద్రమైన గోకవరంలో ఏర్పాటు చేయగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్వరి, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు తుని–గుల్లిపాడు మధ్యలో పాయకరావుపేట నాగరాజుపేట గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై వంగపండు రంగు గడుల ఫుల్ చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు, కుడిచేతిపై లక్ష్మి అనే పచ్చబొట్టు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు తెలియ పరచాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

జగ్గంపేట: మండలంలోని రామవరం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక నెహ్రూ కాలనీకి చెందిన గూనపల్లి లక్ష్మణరావు (30) గ్రామాల్లో సేకరించిన పాల క్యాన్లను తన ఆటోలో యర్రవరం వద్ద ఉన్న హెరిటేజ్ పాలకేంద్రానికి తరలిస్తువుంటాడు. యథావిధిగా ఆదివారం యర్రవరంలో పాలకేంద్రానికి పాలు అప్పగించి రాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. మండలంలోని రామవరం గ్రామ శివారులో బొప్పిడి సిరామిక్స్ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారి16పై వెనుక నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ లక్ష్మణరావు ఆటోను ఢీకొట్టింది. ఆటో తిరగబడడంతో లక్ష్మణరావు తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని జగ్గంపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నండోడు చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక ఎస్సై గణేష్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నండోడు చెరువులో శరీరంపై దుస్తులు లేకుండా ఉన్న సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గత కొంతకాలంగా మతిస్థిమితం లేని వ్యక్తి ఆ ప్రాంతంలో తిరుగుతున్నాడని, అతడే చెరువులో పడి మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై బొర్రంపాలెం వీఆర్వో లాజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు.

వాన జోరు... అన్నదాత బేజారు

- అకాల వర్షాలతో పంటలకు నష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు



ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు



శంఖవరం మండలం అరెంపూడిలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ



ముక్కొల్లులో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఏఓ అమృత

తొండంగి: ఆరుగాలం కష్టించి పండించిన వరిపంట అకాల వర్షానికి తడిసిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన కుండపోత వర్షానికి మండలంలోని ఎ.కొత్తపల్లి, కృష్ణాపురం, తొండంగి, కోదాడ, శృంగవృక్షం తదితర ప్రాంతాల్లో కోత కోసి పనలపై ఉన్న వరి పంట, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయాయి. మండలవ్యాప్తంగా 6 వేల ఎకరాలకు పైగా ఈ ఏడాది రబీ వరిసాగు చేయగా ఇప్పటికే 4018 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, ఇంకా 2100 ఎకరాల్లో పంట కోత కోయాల్సి ఉందని తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. కృష్ణాపురం, తొండంగిలో పనలపై తడిసిన వరిపంటలను పరిశీలించారు. 120 ఎకరాల్లో పనలపై వరి పంట తడిసిందన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైతే పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఏఓ ఎస్.నరసింహం, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కొప్పన దైవప్రసాద్, వీఏఏలు ఉన్నారు.

రైతులు అధైర్య పడొద్దు

కిర్లంపూడి: అకాల వర్షాలకు పలు గ్రామాల్లో ధాన్యం రాశులు తడిసిపోయాయని, రైతులు అధైర్య పడొద్దని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. మండలంలోని ముక్కొల్లు గ్రామ పొలాల్లో తడిసిన ధాన్యం రాసులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 50 ఎకరాల్లో వరి పంట కోసి పనలపై ఉందన్నారు. అకాల వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోయి ఉంటే బయటకు పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో తడిసిన వరిపంటను పరిశీలిస్తున్న తుని ఏడీఏ బుల్లిబాబు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా సుమారు ఐదు గంటల పాటు వర్షం పడింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండు వేసవిలో అకాల వర్షాలు పడడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. పెళ్లి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు చేసుకునే వారు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు ముంపునకు గురయ్యాయి. తరగతి గదుల్లోకి నీరుచేరింది. పలు కాలనీల్లోని ప్రధానరహదారులపై నీరు నిలిచిపోయింది. కాలనీల్లో డ్రైన్లు అధ్వానంగా ఉండడంతో వర్షపునీరు ఇళ్లమధ్య నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వర్షంతో కూల్ కూల్

తుని: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు అల్పపీడన ప్రభావంలో కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. తుని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురిసింది. వాతావరణం ఒక్క సారిగా మారి చల్లబడింది. చల్లటి గాలులు వీయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలోని పలు రోడ్లుపైకి వర్షం నీరు చేరింది. వర్షం కారణంగా డ్రైన్లలో పూడికతీత పనులు నిలిపి వేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

భారీ వర్షం

గోకవరం: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క గత కొన్ని రోజులుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి సేదతీరారు.

శంఖవరం: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలనంటింది. పలు చోట్ల కోసి పనలపై ఉన్న పంట తడిసి ముద్దయింది. అరటి తోటలు నేల కొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండల వ్యవసాయాధికారి పి.గాంధీ గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు వరి పంటను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని ఆయన సూచించారు.

పంట పొలాల పరిశీలన

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో వర్షానికి తడిసిన వరి పొలాలను సోమవారం తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ తదితరులు పరిశీలించారు.